కమలాపూర్ : జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్



జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. తహసీల్దార్ కార్యాలయాల్లో తహసీల్దార్లు జాతీయ జెండాను ఆవిష్కరించగా.. వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో, రాజకీయ పార్టీ కార్యాలయాల్లో జాతీయ జెండా రెపరెపలాడింది. అదే విధంగా పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరధామంలో పోరాటయోధుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత జాతీయ జెండాను ఆవిష్కరించారు.

- సాక్షి నెట్‌వర్క్

ఎల్కతుర్తిలో..



భీమదేవరపల్లిలో..





పరకాల పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ధర్మసాగర్‌లో..



ఐనవోలులో..



కమలాపూర్‌లో..



శాయంపేటలో..



నడికూడ : తహసీల్దార్ కార్యాలయంలో..



దామెర : జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్



కమలాపూర్ : ఎంజేపీ పాఠశాలలో..



నయీంనగర్ : 'కుడా' కార్యాలయంలో..



వేలేరు : మండల పరిషత్ కార్యాలయంలో

## క్లుప్తంగా

### పోలీస్‌లపై చర్య తీసుకోవాలి

**నడికూడ** : దామెర పోలీసుల పై చర్య తీసుకోవాలని మండలంలోని కంఠాత్మకూర్ గ్రామానికి చెందిన గట్టు నవీన్ కోరారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి గణేశ్ నిమజ్జనంలో దామెర ఎస్సై డ్రైవర్ తమ వద్దకు వచ్చి సార్ డబ్బులు అడుగుతున్నాడని ఇవ్వకపోతే నూసెన్స్ కేసు నమోదు చేస్తామని బెదిరించాడని తెలిపాడు. దీంతో డ్రైవర్ చెప్పిన ఫోన్ నంబర్‌కు రూ.500 ఫోన్‌పే చేశానని, డ్రైవర్ మళ్లీ వచ్చి సార్ అదనంగా డబ్బులు అడుగుతున్నాడని చెప్పాడని ఆరోపించాడు. దీంతో తమ వద్ద డబ్బులు లేవని చెప్పగా ఎస్సై సైతం బూతులు తిడుతూ తమను కొట్టినట్లు బాధితుడు తెలిపాడు. మంగళవారం చికిత్స కోసం పరకాల సివిల్ ఆస్పత్రికి వెళ్లగా వైద్య పరీక్షలు చేసిన వైద్యులు వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారని తెలిపాడు. తనపై అకారణంగా దాడి చేసిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**మద్యం తాగి వీరంగం చేశారు.. ఎస్సై**

ఈ విషయమై దామెర ఎస్సై అశోక్‌ను వివరణ కోరగా కంఠాత్మకూరు గ్రామానికి చెందిన యువకులు వినాయక నిమజ్జనం సందర్భంగా మద్యం సేవించి వీరంగం సృష్టించారని, మత్తులో రోడ్డుపై బీరు సీసాలను పగలగొట్టి స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తుంటే సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లినట్లు తెలిపారు. గట్టు నవీన్‌తో పాటు కొంతమంది మద్యం తాగి నిమజ్జన కార్యక్రమాలకు అటకం కలిగిస్తుండగా నచ్చచెప్పే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. కానీ వాళ్లు పోలీసులపై దురుసుగా ప్రవర్తించగా, పలువురిని చెదరగొట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో తన చేతికి గాయమైందని, ఆ యువకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక

**శాయంపేట** : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వరుణ్ 10వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమార్ తెలిపారు. ఈ నెల 19 నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. గత నెల 30వ తేదీన హనుమకొండ పట్టణంలోని జవహర్‌లాల్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో అండర్–16 సబ్‌జూనియర్ విభాగంలో వరుణ్ 60మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్‌లో పాల్గొని రజత పతకాలు సాధించినట్లు తెలిపారు. టీ వీరేంద్ర అండర్–14 విభాగంలో 60 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అండర్ 16 జూనియర్ విభాగంలో 10వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న వరుణ్‌ను ప్రధానోపాధ్యాయుడు కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ హైమా, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

**రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక**


**ఆత్మకూరు** : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి పెరుమాండ్ల ఈశ్వర్ జేఎస్ఎస్ గ్రౌండ్‌లో నిర్వహించిన 38వ తెలంగాణ సబ్‌జూనియర్ విభాగంలో హ్యాండ్‌బాల్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈశ్వర్‌ను మంగళవారం పాఠశాల హెచ్‌ఎం అభినందించారు.

**జాతీయస్థాయి యోగాసన పోటీలకు..**



**కమలాపూర్** : మండల కేంద్రంలోని ఎంజేపీ గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి పి.అభికుమార్ జాతీయస్థాయి యోగాసన పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కవితారెడ్డి మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 16న నిర్వహించిన 11వ అంతర్ జిల్లాలస్థాయి యోగాసన ఛాంపియన్‌షిప్ (అండర్16–18 ఏళ్ల విభాగంలో) అభికుమార్ ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు. అంతర్ జిల్లాల స్థాయి ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన అభికుమార్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ సంతోష్, అధ్యాపకులు అభినందించారు.

### బాధితులకు అండగా ఉంటాం



**దామెర** : బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన మాదారపు భిక్షపతి, పులుకుర్తికి చెందిన గోవిందు ఉప్పలమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న చల్లా ధర్మారెడ్డి వేర్వేరుగా ఇరువురి పార్థివదేహాలపై పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, మాజీ వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, యూత్ వింగ్ అధ్యక్షుడు రాజు, మాజీ ఎంపీటీసీ కృపాకర్ రెడ్డి, శంకర్, ప్రసాద్, స్వామి ఉన్నారు.

# వ్యక్తిగత పరిశుభ్రత అందరి బాధ్యత

**ధర్మసాగర్** : వ్యక్తిగత పరిశుభ్రత అందరి బాధ్యతని ఎంపీడీఓ అనిల్‌కుమార్ అన్నారు. స్వచ్ఛతాహి సేవ 2024లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతాహి సేవ ముఖ్య ఉద్దేశం వ్యక్తిగత పరిశుభ్రత పాటించి గ్రామ స్వరాజ్యం ఏర్పడే విధంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 02వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ అధికారి మంజుల, ఎపీఓ, జేఈ, టీఏ, పంచాయతీ కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.



నడికూడ : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

**నడికూడ** : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్వచ్ఛతాహీ సేవ–2024 కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. వ్యక్తగత, పరిసరాల శుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఎంపీఓ చేతన్‌రెడ్డి, ఏపీఓ విద్యావతి పాల్గొన్నారు.

# రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

**ఎల్కతుర్తి** : ఈనెల 22, 23వ తేదీల్లో కొత్తగూడెంలో నిర్వహించతలపెట్టిన ఏఐటీయూసీ రాష్ట్ర మూడో మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆటో క్యాబ్ ప్రైవేట్ మోటర్స్ అండ్ డ్రైవర్స్ వర్కర్ యూనియన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఏఐటీయూసీ రాష్ట్ర మూడో మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆటో కార్మికుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆటో, క్యాబ్ డ్రైవర్ల ఆర్థికంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12వేల చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహిపాల్‌రెడ్డి, చందర్‌రావు, సంపత్, నసూర్, వీర్‌లింగం పాల్గొన్నారు.

# ఉప్పల్ పాఠశాలలో హిందీ దివస్

**కమలాపూర్** : మండలంలోని ఉప్పల్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయురాలు మాధవి విద్యార్థులకు హిందీ భాషా ప్రాముఖ్యతను, హిందీ నేర్చుకోవడం ద్వారా కలిగే లాభాలను వివరించారు. హెచ్‌ఎం నిర్మల మాట్లాడుతూ.. జాతీయ భాషా హిందీని ప్రతిఒక్కరూ నేర్చుకోవాలని, ప్రపంచంలోనే రెండో అతి పెద్ద భాషా హిందీ అన్నారు. అనంతరం విద్యార్థులకు హిందీలో ఉపన్యాసం, పాటలు, కవితల పోటీలు నిర్వహించగా విద్యార్థులు హిందీ భాషాపై ఆసక్తి కనబరుస్తూ తయారు చేసిన హిందీ వర్ణమాల, వ్యాకరణం, కవి పరిచయాలు, సంఖ్యలు తదితర అంశాలను చార్టుల ద్వారా ప్రదర్శించారు. హిందీ దివస్‌ను పురస్కరించుకుని బాలుర పాఠశాల పూర్వ విద్యార్థి కొమురవెల్లి శ్రీనివాస్ పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు.



విద్యార్థులు ప్రదర్శించిన హిందీ చార్టులతో ఉపాధ్యాయులు

విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నతంగా ఎదగాలని అన్నారు. గురువులు సూచించిన మార్గాన నడుచుకోవాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. రాజేందర్, శిరీష, రఘుపతి, సదాశివరెడ్డి, ప్రకాశ్‌బాబు, జ్యోతి, ఉమారాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



వేలేరు : కేక్ కట్‌చేస్తున్న బీజేపీ నాయకులు



కమలాపూర్ : కేక్ కట్‌చేస్తున్న అశోక్‌రెడ్డి

**వేలేరు** : మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను బీజేపీ మండల అధ్యక్షుడు కాట్రేవుల రాజు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కిరణ్, రజనీకాంత్, సురేష్, నాగరాజు, రాంబాబు, చింటూ తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరులో..**

**ఆత్మకూరు** : భారత ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మండల ప్రధానకార్యదర్శి పైడి, మాజీ మండల అధ్యక్షుడు సదానందం, బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, కిసాన్‌సెల్ నాయకుడు బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

**కమలాపూర్** : భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలో బీజేపీ నాయకులు కేక్ కట్‌చేసి స్వీట్స్ పంచిపెట్టారు. ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శోభన్‌బాబు, నాయకులు చేలిక శ్రీనివాస్, అరవింద్, సారయ్య, కుమారస్వామి, ప్రసాద్, తిరుపతిరెడ్డి, కుమార్, భిక్షపతి, శంకర్, శ్రవణ్ పాల్గొన్నారు.

**ధర్మసాగర్** : భారత దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా శివాలయంలో పూజలు చేసిన అనంతరం ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. ఆ పార్టీ నాయకులు యుగేందర్, సదానందం, సుదర్శన్‌రెడ్డి, రమణాకర్‌రెడ్డి, కిషన్, విజయ్‌కుమార్, శివప్రసాద్‌రెడ్డి, విజయ్ కుమార్, సందీప్, ప్రశాంత్, సందీప్, పాల్గొన్నారు.

## రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటుపై నిరసన



**పరకాల** : తెలంగాణ రాష్ట్ర సచివాలయం ఆవరణలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించడంపై బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం పరకాల బస్టాండ్ చౌరస్తాలో తెలంగాలణ తల్లి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. మార్కెట్ మాజీ చైర్మన్ బండి సారంగపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ విజయపాల్ రెడ్డి, శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు, కౌన్సిలర్స్ శనిగరపు రజనీ, చందుపట్ల సుజాత, కో ఆప్షన్ సభ్యుడు షరీఫ్, బీఆర్ఎస్ నాయకులు నేతాని శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, సాయితిరుపతిరెడ్డి, శనిగరపు నవీన్, గొర్రె రాజు, భద్రయ్య, కళావతి పాల్గొన్నారు.

## విద్యార్థికి స్టేషనరీ అందజేత

**నడికూడ** : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న సయ్యద్ సఫియా అనే విద్యార్థినికి స్థానిక తహసీల్దార్ నాగరాజు బ్యాగ్, నోట్‌బుక్స్, ఇతర స్టేషనరీ అందించారు. ఇటీవల పాఠశాలను సందర్శించగా సఫియా ప్రతిభను గుర్తించడం జరిగిందని తెలిపారు. సఫియా 10వ తరగతి వరకు అయ్యే ఖర్చును తానే భరిస్తానని మాట ఇచ్చానని గుర్తు చేశారు.

# అనుచిత వ్యాఖ్యలు చేస్తే మూల్యం తప్పదు

కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక

**ఎల్కతుర్తి** : బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ముల్కనూరులో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మతో డప్పుచప్పుళ్ల నడుమ శవయాత్ర నిర్వహించి దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం కౌశిక్‌రెడ్డి అహంకారానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరినప్పుడు చీరలు, గాజులు గుర్తుకు రాలేదా అని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళ కాంగ్రెస్ నాయకురాలు చిదురాల స్వరూప, నాయకులు గజ్జెల రమేష్, సంపత్, తాళ్లపల్లి కిరణ్, షఫ్రిక్, అనిల్, స్వర్ణలత, శారద, విజయరెడ్డి పాల్గొన్నారు.



కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

# సఖి సేవలను వినియోగించుకోవాలి



సఖి సేవలపై అవగాహన కల్పిస్తున్న శ్రీదేవి

**ఐనవోలు** : సఖి–వన్‌స్టాప్ సెంటర్ సేవలను మహిళలు వినియోగించుకోవాలని లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ హరిత అన్నారు. మంగళవారం మండలంలోని నందనం గ్రామంలో ఉచిత మహిళ కుట్టు శిక్షణ కేంద్రంలో వీఓ సభ్యుల సమక్షంలో సఖి–వన్ స్టాప్ సెంటర్ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్‌స్టాప్ సెంటర్ కొనసాగుతుందన్నారు. మహిళలు చట్టాలను ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. సఖి సెంటర్‌లో విడిపోయే భార్యాభర్తలకు కౌన్సెలింగ్, వరకట్న, లైంగిక వేదింపులు, గర్భవిచ్ఛిత్తి తదితరాల వేదింపులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. మహిళలు, బాలికల రక్షణ కల్పించడమే లక్ష్యంగా సఖి కేంద్రం పని చేస్తుందన్నారు. న్యాయ, పోలీస్, వైద్య, తాత్కాలిక వసతి సహాయం సఖి కేంద్రం ద్వారా అందించబడుతుందని తెలిపారు. బాధిత మహిళలు, బాలికలు 0870–245112 లేదా టోల్ ఫ్రీ నెంబర్ 181కు ఫోన్ చేయాలని సూచించారు.

# పోరుబిడ్డల త్యాగాలు మరువలేనివి

**పరకాల** : నిజాం పాలనకు, రజకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా పరకాల గడ్డపై నాడు పోరాడిన పోరాటయోధుల త్యాగాలు మరువలేనివని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పట్టణ అధ్యక్షుడు భిక్షపతి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ కాళీప్రసాద్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ సంతోష్‌కుమార్, గురుప్రసాద్‌తో పాటు బీజేపీ నాయకులు హాజరై అమరవీరుల మైదానంలో నివాళులర్పించారు. అనంతరం శక్తిస్థల్ వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. అదే విధంగా స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పింగిళి విజయపాల్‌రెడ్డి పరకాల అమరవీరుల మైదానంలోని శిలఫలకానికి పూల మాలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు.

**శాయంపేట** : తెలంగాణ విమోచన దినోవత్సవాన్ని అధికారికంగా నిర్వహించకుండా ప్రజాపాలన దినోత్సవం అనే పేరుతో వేడుకలు నిర్వహించడం హాస్యాస్పందంగా ఉందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి రామకృష్ణ విమర్శించారు. మండల కేంద్రంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆ పార్టీ బూత్ అధ్యక్షుడు నవీన్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పు రాజు, సీనియర్ నాయకులు బాసాని విద్యాసాగర్, వనం దేవరాజ్, శేఖర్, సుమన్ పాల్గొన్నారు.



పరకాల : అమరదామంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు



శాయంపేట : జాతీయ జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న నాయకులు

**కమలాపూర్‌లో..**

**కమలాపూర్** : తెలంగాణ విమోచన దినోత్సవాన్ని మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్ రెడ్డి, శనిగరంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బండి కోటేశ్వర్ జాతీయ జెండాను ఆవిష్కరించి నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

**ధర్మసాగర్** : తెలంగాణ విమోచన దినోత్సవాన్ని మండల కేంద్రంలో బీజేపీ నాయకులు మంగళవారం నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు రాజుగౌడ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మపేరుతో మొక్క నాటుదాం

**శాయంపేట** : అమ్మ పేరుతో మొక్క నాటాలని, మొక్కలతోనే మానవాళికి మనుగడ లభిస్తుందని ఎంపీడీఓ ఫణిచంద్ర అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ తమ ఇంటిలో ఐదు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థులు గ్రామాల్లో మొక్కల ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని కోరారు. ఏపీఓ కీర్తి అనిత్, టెక్నికల్ అసిస్టెంట్ గౌతం, పంచాయతీ కార్యదర్శి రత్నాకర్, ఎఫ్ఏ సదయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శివాలయ నిర్మాణానికి విరాళం అందజేత

**ఆత్మకూరు** : మండల కేంద్రంలోని మహిమాన్విత పార్వతిసమేత మహాదేవ స్వామి పంచకూట శివాలయం పునర్నిర్మాణానికి కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి మంగళవారం ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.5లక్షల విరాళాన్ని కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను పుట్టిన ఊరిలో నిర్మాణం అవుతున్న శివాలయం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఇనగాల ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వివేకానందరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులకు విరాళం అందచేస్తున్న కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, డాక్టర్ వివేక్